

మడకశిర పోలీసు స్టేషన్ వద్ద అంగన్‌వాడీల నిరసన

హిందూపురంలో గేదెపై జగన్ అని రాసిన అంగన్‌వాడీలు



గేదెలకు అంగన్‌వాడీల వినతి

నేడు కలెక్టరేట్ దిగ్బంధానికి పిలుపు

నోటీసులతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు

జగమొండి జగన్..



గేదెపై సీఎం చిత్రాన్ని అతికించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

● నేడు కలెక్టరేట్ దిగ్బంధం

పుట్టపర్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ తాము రోడ్డెక్కి సమ్మె చేస్తున్నా సీఎం జగన్ దున్నపోతులా వ్యవహరిస్తున్నారని అంగన్‌వాడీలు మండిపడ్డారు. సీఎం తీరుకు నిరసనగా గేదెలకు వినతి అందించి, వినూత్నరీతిలో నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 22వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా మంగళవారం ఆయా మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరసనలతో హోరెత్తించారు. పాదయాత్రలో సీఎం ఇచ్చిన హామీలు, తమ సమస్యలు పరిష్కరించాలని నాలుగున్నరేళ్లుగా వినతులు ఇస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని వారు మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం విరమించేది లేదని ఉద్ఘాటించారు. హిందూపురంలో గేదెపై జగన్ అని రాసి, నిరసన వ్యక్తం చేశారు. కదిరి, హిందూపురం, మడకశిర, ధర్మవరం, పుట్టపర్తితోపాటు మండల కేంద్రాల్లో గేదెలకు వినతిపత్రాలు ఇచ్చారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనీ, తెలంగాణ కంటే అదనంగా వెయ్యి ఇస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సమ్మెలో భాగంగా బుధవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్‌ను దిగ్బంధించనున్నట్లు అంగన్‌వాడీలు తెలిపారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలు సమ్మెను విరమించాలనీ లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు.

అంగన్‌వాడీ నేత అరెస్టు

అంగన్‌వాడీలు.. కలెక్టరేట్ దిగ్బంధం కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. నోటీసులు అందజేస్తున్నారు. అంగన్‌వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి మడకశిర నుంచి పుట్టపర్తికి బస్సులో బయల్దేరారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేష్.. ఆమెను మడకశిర మండలంలోని చౌటుపల్లి వద్ద బస్సు నుంచి దించి కార్యక్రమానికి వెళ్లకూడదంటూ నోటీసు అందజేశారు. అనంతరం ఆమెను పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసు స్టేషన్ వద్దే ఆమె నిరసనకు దిగారు. దీంతో పలువురు అంగన్‌వాడీలు అక్కడికి చేరుకుని, స్టేషన్ ముందు బైఠాయించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా కలెక్టరేట్ దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఉద్ఘాటించారు.



అంగన్‌వాడీ నేత శ్రీదేవికి నోటీసు అందజేస్తున్న ఎస్‌ఐ లోకేశ్

ఉద్యోగ భద్రతా.. ఉరితాళ్లా జగనన్నా?



మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

పుట్టపర్తిరూరల్, జనవరి 2: సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 14వ రోజు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉద్యోగ భద్రత కల్పిస్తావా.. ఉరి వేస్తావా.. జగనన్నా..? అంటూ మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని తెగేసి చెప్పారు. మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగ జేఏసీ నేత ఓబిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన ఉద్యోగ భద్రత, కనీసవేతనం, హెచ్‌ఆర్‌సీ అమలు హామీలు మాత్రమే నెరవేర్చమని అడగుతున్నామనీ, అది కూడా ప్రభుత్వానికి చేతకాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో 32 మండలాల సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ పోరుబాట



కొత్తచెరువు, జనవరి 2: సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాకేంద్రం పుట్టపర్తిలో బుధవారం పోరుబాట చేపట్టనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలనీ, బకాయిలు వెంటనే మంజూరు చేయాలనీ తదితర డిమాండ్లతో పోరుబాట చేపడుతున్నామన్నారు. పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ధర్నా చేపడతామన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

అడ్డుకుంటాం.. సత్తా చూపుతాం..

■ మున్సిపల్ కార్మికుల ఉద్ఘాటన

■ ట్రాక్టర్‌కి అడ్డంగా పడుకుని నిరసన



మడకశిరలో ట్రాక్టర్‌కు అడ్డంగా పడుకుని నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

మడకశిరటౌన్, జనవరి 2: సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మెలో వెనక్కి తగ్గేది లేదనీ, సత్తా చూపుతామని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు.. ఉద్ఘాటిస్తున్నారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలనీ, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో వీధులు చెత్తతో నిండిపోయి, దుర్గంధం వెదజల్లుతున్నాయి. దానిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చేపడుతున్న చర్యలను కార్మికులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. మడకశిర నగర పంచాయతీ అధికారులు.. ప్రైవేటు వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయించాలని భావించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న ట్రాక్టర్‌ను బయటకు తీస్తుండగా.. సమ్మెలో ఉన్న కార్మికులు అక్కడికి చేరుకున్నారు. ట్రాక్టర్ చక్రాలకు అడ్డంగా పడుకుని, నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ట్రాక్టర్ కదిలేకి లేదని ఉద్ఘాటించారు. ప్రభుత్వం ఎంత బెదిరించినా ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంటామన్నారు. చేసేదిలేక ట్రాక్టర్‌ను మున్సిపల్ అధికారులు అదే స్థానంలో నిలిపివేశారు. దీంతో కార్మిఋులు ఆందోళన విరమించారు. హిందూపురంలో పారిశుధ్య పనులను కార్మికులు అడ్డుకున్నారు. పుట్టపర్తిలో మోకాళ్లపై నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిరసనలు కొనసాగించారు.

● ఆగిపోయిన పనులు

పంచాయతీ కేంద్రాల్లో వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటుకు మూడేళ్ల క్రితమే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాకు 293 హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.20.80 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 62 మాత్రమే పూర్తయ్యాయి. 131 భవనాల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. పనులు మొదలుపెట్టనివి 100దాకా ఉన్నాయి. కొత్తచెరువులో సీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.3.5 కోట్లు, వైద్య పరికరాలకు రూ.కోటి మంజూరయ్యాయి. మండలకేంద్రంలోని వైద్యశాల 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అవుతుండటంతో అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని మూడు మండలాల ప్రజలు సంబరపడ్డారు. వారి ఆశలు అడియాసలయ్యాయి. ఆస్పత్రి భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని వైసీపీ పాలకులు ప్రగల్భాలు పలికారు. అందులో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేస్తాం.. వైద్యులను నియమిస్తామంటూ పాలకులు హామీలు గుప్పించారు. మూడేళ్లు దాటినా హెల్త్ క్లినిక్‌ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాకు 293 హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా.. 62 మాత్రమే పూర్తయ్యాయి. వంద వరకు భవన నిర్మాణాలే మొదలుకాలేదు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే.. పాలకులకు ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందకనే నిర్మాణాలు ఆపేసినట్లు తెలుస్తోంది.

- కొత్తచెరువు



నత్తనడకన సాగుతున్న కొత్తచెరువు 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం

- ముందుకుసాగని పనులు
- కాంట్రాక్టర్లకు అందని బిల్లులు
- జిల్లాకు మంజూరు 293
- పూర్తయినవి 62
- పనులు మొదలు కానివి 100



ఆధునిక వైద్యం..
చోద్యం..!

ఆర్భాటంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం



పాత ఆస్పత్రిలోనే వైద్యసేవలు

ప్రస్తుతం ఉన్న పాత ఆస్పత్రిలో ఆశించిన స్థాయిలో వైద్యసేవలు అందట్లేదు. కేవలం ఓపీ, ప్రసవం కేసులు, గర్భిణులకు వైద్యపరీక్షలు, సీజనల్ వ్యాధులకు చికిత్స, టీకాలు మాత్రమే డాక్టర్లు అందిస్తున్నారు. దీంతో అత్యవసర, రాత్రివేళల్లో, ప్రమాద పరిస్థితుల్లో ఆస్పత్రికి వస్తే వైద్యులు అందుబాటులో ఉండరని జనం అంటున్నారు. 24 గంటలు ప్రజలకు సేవలందించాల్సిన ఆస్పత్రి సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రి 6 గంటలకే మూతపడుతోందన్న విమర్శలు లేకపోలేదు. దీంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. వైద్యపరీక్షలతోపాటు చికిత్సల కోసం లక్షలాదిరుపాయలు వెచ్చిస్తూ తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

పెట్టెలకే పరిమితమైన వైద్య పరికరాలు

30 పడకల ఆస్పత్రికి సంబంధించిన వైద్య పరికరాలు పెట్టెలకే పరిమితమయ్యాయి. మెరుగైన వైద్య సేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 30 పడకల ఆస్పత్రి సంగతి దేవుడెరుగు? కనీసం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా లేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరడం, వర్షం వచ్చినపుడల్లా గదులన్నీ కారుతున్నాయి. దీంతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. ఆస్పత్రికి వైద్యానికి వస్తే తమపై పెచ్చులూడి పడుతున్నాయని రోగులు వాపోతున్నారు.







వైద్య పరికరాలు ఉంచిన పెట్టెలు

జాడలేని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ

ప్రభుత్వ ఆస్పత్రులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటి పరిష్కారానికి కృషి చేసే ఆస్పత్రి అభివృద్ధి కమిటీల జాడలేకుండా పోయింది. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో విధులు నిర్వహించాల్సిన వైద్యులు ప్రైవేటు సేవలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో ప్రభుత్వ వైద్యం ప్రశ్నార్థకంగా మారింది. ఆరోగ్య సిబ్బందిని అడిగే వారు లేరు. దీంతో వైద్యం అందక గ్రామీణ రోగులు అల్లాడుతున్నారు. వైద్య పరికరాలు సైతం పనిచేయట్లేదు. విద్యుత్ సరఫరా కూడా ఆస్పత్రికి సరిగా లేకపోవడంతో వైద్యులు చీకటిలోనే వైద్యం అందించాల్సిన దుస్థితి కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రిలో నెలకొంది.

ప్రైవేటు వైపు మొగ్గు

ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతుండటంతో రోగులు ప్రైవేటు వైద్యానికే మొగ్గు చూపుతున్నారు. మండలంతోపాటు పలు గ్రామాల్లో ఆర్‌ఎంపీలే దిక్కయ్యారు. దీనిని ఆసరాగా చేసుకుని ఆర్‌ఎంపీలు అందినకాడికి దోచుకునే పరిస్థితి ఏర్పడింది. మెడికల్‌షాపులతో ఆర్‌ఎంపీలు కుమ్మక్కై అవసరం లేకున్నా మందులు ఇస్తూ పేదల జేబులకు చిల్లులు పెడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

ఆస్పత్రి నిర్మాణం త్వరగా చేపడతాం

కొత్తచెరువులో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు జాప్యమవుతున్న విషయం వాస్తవమే. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐడీసీ ఈఈ లక్ష్మీకాంతరెడ్డికి సూచించాం.

- డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీసీహెచ్‌ఎస్




- ప్రయత్నాలు కూడా చేయని ఎంపీ
- అధిష్టానం తీరుపై సన్నిహితుల వద్ద ఆవేదన
- ప్రతిపక్ష నేతలను ఎంత విమర్శించినా ఏం లాభమని నిర్వేదం
- పదవి ఇస్తామని ఆహ్వానించి.. పట్టించుకోవడం లేదని ఆవేదన

శాంతకు ఎంపీ టిక్కెట్టు ఖరారుతో గోరంట్ల ఆశలు గల్లంతు

మాధవ్ దారెటు?





హిందూపురం, జనవరి 2: రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీకి చెందిన సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు మళ్లీ టిక్కెట్టు దక్కించుకునేందుకు ఎవరి స్థాయిలో వారు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ముఖ్య నేతల ద్వారా పావులు కదిపారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మాత్రం ఏ ప్రయత్నమూ చేయకుండా మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. ఈసారి తనకు టిక్కెట్టు లేనట్లేనని నిర్ణయానికి వచ్చాడో, ఇక మాట్లాడి ప్రయోజనం ఏముంటుందని భావించారో ఏమో తెలియదు కానీ, మౌనం వహించారు. అప్పట్లో తనకు పదవి ఇస్తామని చెప్పడంతోనే పోలీసు ఉద్యోగం వదిలి, వైసీపీలో చేరాననీ, ఇప్పుడేమో పట్టించుకునే వారే లేరని సన్నిహితుల వద్ద ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీని నమ్ముకుని, ప్రతిపక్ష నేతలపై తీవ్ర విమర్శలు చేశాననీ, అయినా ఏం లాభమని వాపోయినట్లు చర్చ సాగుతోంది. బళ్లారి మాజీ ఎంపీ శాంతకు హిందూపురం ఎంపీ టిక్కెట్టు ఖరారైంది. ఈ నేపథ్యంలో ఆమె అధినేత జగన్ సమక్షంలో మంగళవారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పక్క పార్లమెంటు ప్రజాప్రతినిధిని ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించినా.. మాధవ్‌కు మాత్రం ఎలాంటి పిలుపుకానీ, చర్చించడం కానీ జరగలేదని తెలుస్తోంది. దీంతో మాధవ్ లోలోపలే రగులుతున్నట్లు సమాచారం. అధినేత మాటవిని 2019లో పోటీచేశాననీ, అప్పట్లో ఏదో ఒక పదవి ఇస్తానని చెప్పడంతోనే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయాల్లోకి ప్రవేశించాననీ, ఐదేళ్లకే ఇలా అయితే భవిష్యత్తు ఎలా అని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఎంత విమర్శించినా.. ఏం లాభం?

ఇదే జిల్లాలో పోలీసు అధికారిగా పనిచేస్తూ 2019కి ముందు అప్పటి అధికార పార్టీ నేతలపై విమర్శలు చేయడం, తొడగొట్టడం, మీసాలు మెలివేయడానికితోడు కుల ప్రాతిపదికన మాధవ్‌ను వైసీపీలోకి ఆహ్వానించి, టిక్కెట్టు ఇచ్చారు. ఎంపీగా గెలవడంతో అధినేత జగన్‌పై భక్తి ప్రదర్శించుకునేందుకు తరచూ ప్రతిపక్ష నేతలపై మాధవ్ తీవ్ర విమర్శలు గుప్పించేవారు. ఈ పరిస్థితుల్లో అయనకు ఎలాంటి అవకాశం, హామీ లేకపోవడంతో ఐదేళ్లుగా ప్రతిపక్ష నేతలపై ఎన్నో విమర్శలు చేశాననీ, అయినా తనకు ప్రయోజనం ఏంటని లోలోపలే మదన పడుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఏ ప్రజాప్రతినిధి విమర్శించనంత రీతిలో తాను మాట్లాడాననీ, అయినా అధిష్టానం తన గురించి ఆలోచించకపోవడం బాధాకరమని ఆయన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేవలం సర్వేల ప్రకారం తనకు అవకాశం లేదని పార్టీలోని కొంతమంది నేతలు చెప్పుకోవడం సరికాదని పేర్కొన్నట్లు తెలిసింది. సర్వేల ప్రకారమే టిక్కెట్లు కేటాయించినట్లయితే ఇదే జిల్లాలో కొంతమంది ఓడిపోతారని సర్వే ఫలితాలు వచ్చినా.. వారికే అవకాశం ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది పార్టీలో ముఖ్యనేతలకు అనుకూలంగా ఉన్నవారికి సర్వేలు వ్యతిరేకంగా వచ్చినా టిక్కెట్టు ఇచ్చారనీ, పార్టీపై నమ్మకంతో ఐదేళ్లుగా తాను చేసిన కృషి నిష్ప్రయోజనమా అన్నది ఆయనలో మెదలుతున్న ప్రశ్న ఆయన సన్నిహితులు కొంతమంది బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారు.



శాంత చేరికతో ఆశలు గల్లంతు

కొన్ని రోజులుగా హిందూపురం ఎంపీ టిక్కెట్టు బోయ సామాజికవర్గానికి చెందిన మహిళకు ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి మాజీ ఎంపీ బోయ శాంత.. ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోవడం, ఆమెకు వెంటనే హిందూపురం టిక్కెట్టు ఖరారు చేయడం చకచకా జరిగిపోయాయి. ఆమె వెంట ఉన్న గుంతకల్లు ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు కొంతకాలంగా హిందూపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హిందూపురంలో ఇల్లు చూడాలని ఆమె సామాజికవర్గానికి చెందిన కొంతమంది నాయకులకు చెప్పినట్లు తెలిసింది. ఆమెకు టిక్కెట్టు ఖరారు చేయడంతో ఎంపీ గోరంట్ల మాధవ్‌కు దారులు మూసుకుపోయాయనడంలో సందేహం లేదు. బోయ శాంత గుంతకల్లు ప్రాంతవాసి. 2009లో బళ్లారి నుంచి బీజేపీ తరఫున ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. మాజీ మంత్రి బళ్లారి శ్రీరాములు సోదరి. ఈమెను పార్టీలోకి తీసుకునేందుకు ఇక్కడ ఓ పెద్దాయనతోపాటు ఓ ఎంపీ కీలకంగా వ్యవహరించారు. కర్ణాటకకు చెందిన బీజేపీ నేతలతోపాటు మరో మాజీ మంత్రి కూడా పనిచేసినట్లు తెలిసింది.

చెరువులో పడి చిన్నారి మృతి

గుడిబండ, జనవరి 2: మండలంలోని ముతుకూరు గ్రామానికి చెందిన మల్లికార్జున కుమారుడు చిన్నారి జశ్వంత్(3) చెరువులో పడి మంగళవారం మృతిచెందాడు. ఏఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. గత నెల 31న జశ్వంత్ గ్రామంలోని దుకాణం వద్దకు తినుబండారాలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, పరిసర ప్రాంతాల్లో కుటుంబికులు వెతికినా ఆచూకీ దొరకలేదు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం చెరువులో చిన్నారి శవమై తేలడంతో గమనించిన గ్రామస్థులు.. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి పరిశీలించారు. తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్నారి మృతితో ముతుకూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



జశ్వంత్ మృతదేహం



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

సొంతపార్టీ నేతలే విసిగి పోయారు

- వైసీపీ ఖాళీ కావడం ఖాయం
- మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, జనవరి 2: సొంత పార్టీ నేతలే వైసీపీ ప్రభుత్వంపై విసిగిపోయారని, మరో మూడు నెలల్లో వైసీపీ పూర్తిగా ఖాళీ అవుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం మాజీ మంత్రి పరిటాల సునీత స్వగృహంలో ఎంసీపల్లి పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ కీలక నేతలు, సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి ఆధ్వర్యంలో పరిటాల సునీత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పరిటాల సునీత పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి వైఖరి నచ్చక ప్రభుత్వ విధానాలను నచ్చక తామంతా పార్టీ వీడనట్టు వారు చెబుతున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రజలలోనే కాకుండా సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల్లోకూడా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందన్నారు. మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, నియోజకవర్గంలో ఎమ్మెల్యేసోదరుల దౌర్జన్యాలు, వారి చర్యలతో చాలా మంది విసిగిపోయి టీడీపీలోకి వస్తున్నారన్నారు. మరో నెల రోజుల్లో ఇంకా చాలా మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరే అవకాశం ఉందని, టీడీపీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని, ప్రతి ఒక్కరూ చంద్రన్నను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయలని సూచించారు. అస్తవ్యస్థంగా మారిన ఏపీ మళ్లీ అభివృద్ధి బాటలో నడవాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. వైసీపీ పాలనతో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, మాజీ సర్పంచ్ ముత్యాలు, మారుతీప్రసాద్, మంగాపురం ఆదినారాయణ, రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారు వీరే: గరిమేకలపల్లికి చెందిన కురుబ మారుతీప్రసాద్, లింగమయ్య, రమేశ్, గలగల నరసింహులు, కుమార్, కురుబ బాబు, మాలశంకర్, మాల గోపాల్, గొల్లశివకుమార్, ఎంసీపల్లికి చెందిన బోయ రామాంజినేయలు, ఎం నారాయణ, ముత్యాలప్ప, పెద్ద నరసింహుడు, గురుప్రసాద్, చిన్న నరసింహులు టీడీపీలో చేరారు.

వైసీపీలో కొత్త మంటలు..!

ఇన్‌చార్జిల మార్పుతో శ్రేణుల్లో ఆగ్రహావేశాలు

- అనంతపురం ఎంపీ స్థానానికి శంకరనారాయణ
- పురం ఎంపీ స్థానానికి శ్రీరాములు చెల్లెలు శాంత
- సిట్టింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్ గల్లంతు
- కదిరిలో సిద్దారెడ్డి ఔట్.. రియల్టర్ మక్బూల్ ఇన్
- పెనుకొండకు మంత్రి ఉష శ్రీచరణ్ బదిలీ
- కళ్యాణదుర్గం ఇన్‌చార్జిగా తలారి రంగయ్య







అనంతపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జుల మార్పులు, చేర్పులతో అధికార పార్టీ శ్రేణుల్లో ఆగ్రహ జ్వాలలు రేకెత్తాయి. పార్టీ నిర్ణయాన్ని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. అధినాయకత్వం నిర్ణయంపై ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మంత్రి బొత్స సత్యనారాయణ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల జాబితాను మంగళవారం రాత్రి విడుదల చేశారు. ఈ జాబితాలో కొందరికి సీట్లు గల్లంతయ్యాయి. దీంతో ఆ వార్గల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. సీట్లు కోల్పోతున్న ఎమ్మెల్యేలకు మద్దతుగా అనుచరవర్గం రాజీనామాలకు వెనుకాడటం లేదు. రచ్చకెక్కి రాజీనామా చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ మాత్రమే మంగళవారం రాత్రి నిర్ణయం ప్రకటించారు. దీంతో కదిరి, పెనుకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో అసంతృప్తులు పెల్లుబుకాయి. రోడ్ల మీదకొచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. స్థానికేతరులు ఏ విధంగా గెలుస్తారో చూస్తామని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే.. తమకు కొత్త ఇన్‌చార్జిలు వద్దే వద్దని అంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మార్పు వైసీపీలో పోను పోనూ మరింత రాజుకునేలా కనిపిస్తోంది.





వీరే ఇన్‌చార్జిలు..

రాష్ట్రవ్యాప్తంగా 27 పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ వైసీపీ ఓ జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా జోలదరాశి శాంతను నియమించారు. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గానికి పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శంకర్ నారాయణను నియమించారు. కదిరి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి స్థానంలో కదిరికి చెందిన రియల్ వ్యాపారి బీఎస్ మక్బుల్ అహమ్మద్‌ను నియమించారు. పెనుకొండ నియోజకవర్గానికి కళ్యాణదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఉష శ్రీచరణ్‌ను నియమించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను నియమించారు.

కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ సీట్లు గల్లంతైనట్లేనని స్పష్టంగా అర్థమవుతోంది.

పొమ్మనలేక పొగ..





పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ పెనుకొండ నుంచే పోటీ చేయాలని భావించారు. కానీ పార్టీ అధినాయకత్వం ఆయనను అనంతపురం ఎంపీగా పోటీ చేయాలని ఆదేశించింది. దీంతో ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరవర్గం తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయనను అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం.. పొమ్మనలేక పొగబెట్టినట్లుగా ఉందని ఆయన అనుచరవర్గం అంటోంది. శంకర నారాయణ సామాజికవర్గాన్ని ప్రామాణికంగా తీసుకుని ఉంటే... హిందూపురానికి కాకుండా అనంతపురం పార్లమెంటు నియోజకవర్గానికి ఎలా పంపుతారని ఆయన సామాజికవర్గం ప్రశ్నిస్తోంది. పార్టీ నిర్ణయంపై శంకర్ నారాయణ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

స్థానికేతరులకా...?

హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా శాంత నియామకాన్ని అధికార పార్టీలోని కొందరు ముఖ్యులు తప్పుబడుతున్నారు. బోయ సామాజికవర్గానికి చెందిన వారిని హిందూపురం పార్లమెంటు ఇన్‌చార్జిగా నియమించాలని పార్టీ అధిష్ఠానం భావిస్తే... పార్టీ ఆవిర్భావం నుంచి కష్టకాలంలోనూ పని చేస్తున్న బోయ నేతలు పార్టీ అధినాయకత్వానికి కనిపించలేదా అని ఆ సామాజిక వర్గంవారు ప్రశ్నిస్తున్నారు. స్థానికులకు కాకుండా పొరుగు రాష్ట్రం నుంచి అరువు తెచ్చుకోవడం ఏమిటని నిలదీస్తున్నారు. స్థానికేతరులను హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించడాన్ని ఆ సామాజికవర్గం నేతలే జీర్ణించుకోలేకపోతున్నారు. తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో బోయ సామాజికవర్గం నేతలే లేరా అని అధినాయకత్వాన్ని ఆ సామాజికవర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

జోలదరాశి శాంత ఎవరు..?



హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బోయ సామాజికవర్గానికి చెందిన జోలదరాశి శాంతను వైసీపీ నియమించింది. సీఎం జగన్ సమక్షంలో మంగళవారం సాయంత్రం ఆమె వైసీపీలో చేరారు. ఆ తరువాత గంటల వ్యవధిలోనే హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆమెను నియమించారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాకు చెందిన శాంత, బీజేపీ మాజీ ఎంపీ శ్రీరాములు సోదరి. 2009లో శాంత బళ్లారి పార్లమెంటు స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేసి గెలిచారు. వైసీపీతో ప్రత్యేక సంబంధాలున్న అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన కీలక నేతల ద్వారా శ్రీరాములు తన సోదరిని ఏపీ రాజకీయాల్లోకి ప్రవేశం చేయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే శాంత వైసీపీ తీర్థం పుచ్చుకున్నారని, ముందస్తు ఒప్పందం మేరకు హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారని సమాచారం.



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానిస్తున్న జేఎన్‌టీయూ వీసీ

స్నాతకోత్సవానికి రండి

- గవర్నర్‌కు వీసీ ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, జనవరి 2: జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవానికి రావాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను వీసీ రంగజనార్ధన ఆహ్వానించారు. ఈ మేరకు విజయవాడకెళ్లి గవర్నర్‌ను కలిసి ఆహ్వానం పలికినట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. వేడుకల నిర్వహణ, గౌరవ డాక్టరేట్ ప్రదానం, గోల్డ్‌మెడల్స్ అందజేత తదితర అంశాలపై చర్చించామన్నారు.

పశువులకు టీకా వేయించండి

అనంతపురం అర్బన్, జనవరి 2 : పశువులకు వేసే గాలి కుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు 3,65,300 గాలికుంటు వ్యాధి టీకాల డోస్‌లు వచ్చాయని, ఈనెలాఖరు దాకా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నాలుగు నెలల వయస్సు దాటిన పశువులకు టీకాలు వేస్తామని తెలిపారు. రైతులు స్థానిక పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కరోనా పాజిటివ్ కేసులు నిల్

అనంతపురం టౌన్ జనవరి 2: జిల్లాలో నాలుగు రోజులుగా కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. మంగళవారం డాక్టర్ల సూచనలమేరకు ఆస్పత్రికి వచ్చిన 42 మందికి శాంపిల్స్ తీసి నిర్ధారణ పరీక్షలకు పంపామని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. అయితే అందరికీ నెగిటివ్ వచిందని పాజిటివ్ కేసులు రాలేదని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలోని కొవిడ్ వార్డులో చికిత్స పొం దుతున్న అనంతనగరవాసి సైతం ఆరోగ్యంగా కోలు కోవడంతో డిశ్చార్జ్ అయ్యారని సూపరింటెండెంట్ తెలిపారు. అనుమానపు లక్షణాలతో ఆస్పత్రికి వస్తే ఓపీ డాక్టర్లు సూచించిన వారికి మాత్రమే కొవిడ్ టెస్టులు చేస్తున్నామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

జిల్లా అటవీశాఖ అధికారిగా వినీత్ కుమార్

అనంతపురం న్యూటౌన్, జనవరి 2: జిల్లా అటవీశాఖ అధికారి సందీప్ కృపాకర్ నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల డీఎఫ్‌ఓగా ఉన్న వినీత్ కుమార్‌ను నియమించారు. దీంతో ఆయన జిల్లా అటవీశాఖ అధికారిగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్‌ను పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పచ్చదనం పెంపుతో పాటు సర్వరీల అభివృద్ధికి తమవంతు చర్యలు చేపడతామన్నారు. దీంతో పాటు అటవీస్థలాల్లో అక్రమణలకు పాల్పడితే సహించేది లేదన్నారు. పచ్చదనం, పర్యావరణం కాపాడడానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

తోలుబొమ్మలాట కళాకారుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న కళాకారుడు చిదంబరరావు

ధర్మవరం, జనవరి 2: మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలు బొమ్మలాట కళాకారుడు చిదంబరరావు బెంగుళూర్‌లని హోసూరు సిటీలో ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్‌రిసెర్చ్ అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాకారుడు చిదంబరరావు మాట్లాడుతూ...తన పూర్వీకుల నుంచి తోలుబొమ్మలాట తయారీచేయుట, ప్రదర్శనలు చేయుట చిన్నతనం నుంచే నేర్చుకున్నానని, తన ప్రగతిని గుర్తించి కర్ణాటక ప్రభుత్వం డిసెంబరు 30న హోసూరులో అవార్డు అందజేసిందన్నారు. అవార్డు రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇప్పటి వరకు 25 అవార్డులను పొందానన్నారు.

7న జిల్లా స్థాయి రెడ్డి సంఘం 'ఆత్మీయసభ'

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2: ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీన 'ఆత్మీయసభ' నిర్వహించనున్నారు. నగరంలోని న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలో పేదలకు ఆర్థికంగా, విద్య వైద్యరంగాలలో అవకాశాలు కల్పించేవారికే ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. ఏపీ రెడ్డిసంఘం గౌరవాధ్యక్షుడు బయపురెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, నగర అధ్యక్షుడు హనుమంతరాయరెడ్డి, నాయకులు భాగ్యలక్ష్మిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నితిన్‌రెడ్డి, నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కుమార్ రెడ్డి

జీతాల కోసం శ్రీరామిరెడ్డి కార్మికుల నిరసన



శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టిన కార్మికులు

కళ్యాణదుర్గం, జనవరి 2: పట్టణంలోని శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద కార్మికులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. తమకు జీతాలు అందేంత వరకు ఇలాగే నిరసన కార్యక్రమాలు చేపడతామని కార్మికులు హెచ్చరించారు. మంగళవారం పంపుహౌస్‌కు తాళాలు వేసి నిరసన పాటించారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న 225 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని వారు తెలిపారు. ఐదు నెలలుగా జీతాలు అందడం లేదని, తమ కుటుంబాలు గడవటమే కష్టంగా ఉందని వాపోయారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నిరసనలు ఆపేది లేదని, తమ సమస్యలు పట్టించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 2: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థుల పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తన కార్యాలయంలో విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరులో బీటెక్ ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నా రు. ఫలితాల వివరాలకు కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ విష్ణువర్ధన్, లలిత, విభాగాధిపతులు కేఎఫ్ భారతి, అజిత, కళ్యాణిరాధ, శైలాకుమారి, మారాల రామశేఖరెడ్డి, దిలీప్‌కుమార్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

6న జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 2: యువతకు ఈనెల 6వతేదీన కలెక్టరేట్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో జిల్లా స్థాయి వక్తృత్వపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత 3నిముషాల నిడివితో 'భారత్-వికసిత్ భారత్2047' అంశంపై ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగించాలని, జిల్లా స్థాయిలో గెలుపొందిన యువత రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు. ఉత్తమ వ్యాఖ్యానంతో, సరైన అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులను, యువతను ప్రోత్సహించడమే ధ్యేయంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి ఇద్దరికి రూ.25వేలు చొప్పున అందజేస్తారన్నారు. ఆధార్‌కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849871174ను సంప్రదించాలని కోరారు.

టీడీపీలో చేరేందుకు ఇదే సరైన సమయం

కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట

వైసీపీ నుంచి 25 కుటుంబాలు టీడీపీలో చేరిక



కందికుంట సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ కార్యకర్తలు

కదిరి, జనవరి 2: టీడీపీలో చేరడానికి ఇదే సమయమని నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన నివాసంలో తలుపుల మండలంలోని మంగివాండ్లపల్లికి చెందిన 25 కుటుంబాలు టీడీపీ నాయకులు ముబారక్, శంకర్, విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ కందికుంట టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికోసం టీడీపీలో చేరాలని, అందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. బడుగుల కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని అన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతోందన్నారు. పెత్తందార్లను కాదంటే బతికే పరిస్థితి లేదన్నారు. ఈ అరాచక పాలనను అంతమొందించడానికి కదిలి రావాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమన్నారు. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని పేర్కొన్నారు. పార్టీలోకి వచ్చేవారికి సముచిత స్థానముంటుందన్నారు. కార్యక్రమంలో తలుపుల టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, రాజారెడ్డి, మాజీ సర్పంచ్ రామమోహన్, రమణ తదితరులున్నారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వడ్డెర్ల సంఘం నాయకులు

నల్లచెరువు, జనవరి 2: నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని వడ్డెర్ల సంఘం నాయకులు మండల పరిధిలోని పాలపాటిదిన్నెలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయిజిల్లా వడ్డెర్ల సంఘం నాయకులు దలవాయి కుటుంబసభ్యులు వెంకటనారాయణ, రమాదేవి, సిమెంటు పోలన్న, పుట్టపర్తి నియోజకవర్గ వడ్డెర సంఘం నాయకులు పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, దీనిని అంతమొందించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఆంజనేయస్వామిని కోరినట్లు వారు పేర్కొన్నారు. పూజల్లో వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపిటి క్రిష్ణమూర్తి, గంగులప్ప, శ్రీరాములు, ఇందుకూరిపల్లి ఉత్తన్న, అమడగూరు క్రిష్టప్ప, బొట్టు సుధాకర్, తలుపుల శ్రీనివాసులు, పుల్లన్న, సుధాకర్, భాగ్యమ్మ తదితరులున్నారు.

శబరిమలకు పయనమైన మాలధారులు

తాడిమర్రి, జనవరి 2: అయ్యప్ప మాలధారులు మంగళవారం శబరిమలకు పయనమయ్యారు. తెల్లవారుజామున బ్రహ్మముహూర్తంలో గురుస్వాములు సత్యనారాయణ, నారాయణస్వాములు ఇరుముడులు నిర్వహించగా మాలధారులు శబరిమలకు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్ప చిత్రపటాన్ని, పడిని అందంగా అలంకరించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి

తూతూమంత్రంగా గ్రామసభ

తనకల్లు, జనవరి 2: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించి పంచాయతీ అభివృద్ధిపై చర్చించాల్సి ఉంది. అయితే ఆ నిబంధనలకు నీళ్లు వదిలి మండలంలోని అధికారులు గ్రామసభకు డుమ్మాకొట్టారు. సర్పంచ్ సరస్వతమ్మ, కార్యదర్శి తుమ్మలామల దేశాయి క్రిష్ణమూర్తిరెడ్డి మాత్రమే హాజరయ్యారు. అధికారులు హాజరుకాకపోవడంతో తూతుమంత్రగా సభ నిర్వహించి మమ అనిపించారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన



చౌటకుంటపల్లిలో ఓటింగ్ విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నల్లమాడ, జనవరి 2: నల్లమాడ, చౌటకుంటపల్లి, మసకవంకపల్లి, కురమాల గ్రామాల్లో ఈవీఎం ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించారు. మంగళవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్ ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ వాసుదేవరెడ్డి, బీఎల్‌ఓలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

తనకల్లు, జనవరి 2: మండలంలోని కొక్కంటిక్రాస్‌లో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు తనకల్లు నుంచి అమడగూరికి ఆటోలో వెళ్తున్నారు. కొక్కంటి క్రాస్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో నిదానంగా వెళ్తుండగా వెనుకవైపు నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో తనకల్లు చెందిన శ్రీరాములు, మహబూబ్‌బాషాకు తీవ్రగాయాలయ్యాయి. అమడగూరు మండలంలోని కంచెరవాండ్లపల్లికి చెందిన ఆదినారాయణ, గుండువారిపల్లికి చెందిన కళావతమ్మ, పుణ్యవతికి గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగున చికిత్సకోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చేనేత పరిశ్రమ మనుగడ సాగించేనా?

పవర్‌లూమ్స్‌దే హవా

పెద్దసంఖ్యలో పట్టణానికి దిగుబడి

తగ్గిన పట్టుచీరల ఉత్పత్తులు



పవర్‌లూమ్



చేనేత మగ్గం

ధర్మవరం, జనవరి 2: చేనేత పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పరిశ్రమ, ప్రస్తుతం అంపశయ్యపై ఉంది. ఇందుకు ప్రధాన కారణం పవర్‌లూమ్స్. దీంతో ఎవరొచ్చి చేనేత పరిశ్రమను గాడిన పెడతారా అని చేనేత కార్మికులు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

కుదేలవుతున్న పరిశ్రమ

ధర్మవరం అంటేనే చేనేతకు పుట్టినిల్లు. అటువంటి పట్టుకేంద్రంలో చేనేత మగ్గాలను ప్రోత్సహించి పరిశ్రమను బలోపేతం చేయాల్సింది పోయి పవర్‌లూమ్స్‌ను ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమంటూ కొందరు చేనేత కార్మికసంఘం నాయకులు అంటున్నారు. పవర్‌లూమ్స్ ఏర్పాటు చేయడం వల్ల పరిశ్రమ మొత్తం కేవలం కొందరు మాస్టర్స్ వీవర్స్ కబందహస్తాల్లోకి వెళ్లిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వాదనను కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రానురాను చేనేత కుటుంబాలు కూడా ఆ వృత్తికి దూరమవుతున్నాయని, మరో ఐదేళ్లు గడిస్తే మగ్గాలపై చీర నేసే వాడే దొరకని పరిస్థితి ఉంటుందంటున్నారు. ఇటువంటి పరిస్థితిలో పవర్‌లూమ్స్ రాక వల్ల పరిశ్రమ ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తుందని వారి వాదన. .

పెద్దసంఖ్యలో పవర్‌లూమ్స్ చీరల దిగుమతి

పవర్‌లూమ్స్‌పై తయారైన చీరలు ధర్మవరానికి పెద్దసంఖ్యలో దిగుమతి అవుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన పరిశ్రమలోని పెద్దలు, కార్మిక సంఘాలు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో తయారైన పవర్‌లూమ్స్ చీరలను ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముతున్నప్పుడు, ఇక్కడే ఎందుకు తయారు చేయరాదు? అన్న మాటలు కూడా పలువురి నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా దాదాపు వెయ్యికోట్లకు పైగా లావాదేవీలు జరుగుతుండగా, అందులో అగ్రభాగం పవర్‌లూమ్స్ చీరలదే. నాలుగునెలల క్రితం చేనేత కార్మికసంఘాలు పవర్‌లూమ్స్‌పై ఆందోళన చేపట్టారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి కొందరిపై కేసులు పెట్టారు. దీంతో పవర్‌లూమ్స్ మగ్గాలపై చీరలు నేయడం మానేశారు. ప్రస్తుతం మళ్లీ మొదలుపెట్టారు.

తగ్గిన చేనేత ఉత్పత్తులు

కాలానుగుణంగా చేనేత కుటుంబాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకొంటున్నాయి. గిట్టుబాటు ధర లభించకపోవడంతో పిల్లలను మరోవృత్తి వైపు మరలుస్తున్నారు. కొందరు విద్య, ఉద్యోగం వైపు దృష్టి సారించగా మరికొందరు ఇతర వ్యాపారాల వైపు వెళ్తున్నారు. దీంతో మగ్గం నేర్చుకొనేవారే ప్రస్తుతం కరువయ్యారు. గడచిన తరం కార్మికులు మాత్రమే ఈ వృత్తిని వదలలేక అయినకాటికి చీరలు నేస్తూ పబ్బం గడుపుతున్నారు. దీంతో పట్టుచీరల ఉత్పత్తులు పూర్తిగా తగ్గిపోయాయి.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం



ధర్మవరంలో రోడ్డుపై సహపంక్తి భోజనాలు చేస్తున్న కార్మికులు



పుట్టపర్తిలో ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ధర్మవరం, జనవరి 2: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతూ వెంకటేశ్ మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టారని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుందా, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షుడు అడ్రామహేశ్, ప్రధానకార్యదర్శి బొగ్గునాగరాజు, సహాయకార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరిసురేశ్ పాల్గొన్నారు.



కదిరిలో అర్ధనగ్న ప్రదర్శన

పుట్టపర్తి: తమ సమస్యలను సీఎం జగన్ పట్టించుకోవాలంటూ మున్సిపల్ కార్మికులు ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన తెలిపారు. మంగళవారం 8వరోజు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కొనసాగింది. కార్యక్రమంలో సీఐటీయూ గంగాధర్, బాబావలీ, కార్మిక నాయకులు నాగార్జున, గోవిందు, పెద్దన్న, నరసింహులు తదితరులున్నారు.

కదిరిఅర్బన్: మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మెకొనసాగిస్తామని హెచ్చరించారు. వీరికి సీఐటీయూ జీఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, బాబ్‌జాన్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బాలక్రిష్ణ, జనార్దన్, చెన్నక్రిష్ణ, రాజు, నరసింహమూర్తి, సూరి తదితరులున్నారు.

నేడు జిల్లా హాకీ జట్టు ఎంపిక పోటీలు

ధర్మవరం, జనవరి 2: స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో బుధవారం సత్యసాయిజిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక జరుగుతుందని హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు, సత్యసాయిజిల్లా జనరల్ సెక్రటరీ బంధనాధం సూర్యప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు తిరుపతిలో ఈనెల 9 నుంచి 12వతేదీ వరకు జరిగే 14వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర టోర్నీలో పాల్గొంటుందన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేవారు 2005 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని, క్రీడాకారులు తమ వెంట ఆధార్, బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరిఅర్బన్, జనవరి 2: పట్టణంలోని రాజేంద్రప్రసాద్‌వీధి, వాణీస్ట్రీట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు జరుగుతుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని ఏఈ చెన్నకేశవులు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం ఆరుగంటలవరకు ఆయా వీధుల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల వారు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి టీడీపీ పాదయాత్రలు

ధర్మవరం, జనవరి 2: పట్టణంలో గురువారం నుంచి టీడీపీ పాదయాత్రలు జరుగుతాయని నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 40వ వార్డు నుంచి టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ ప్రారంభిస్తారన్నారు. ఈ పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధసంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయండి

నంబులపూలకుంట, జనవరి 2: ఎస్టీయూ వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. ఈనెల 12, 13 తేదీల్లో కర్నూలులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వేడుకలు జరగనున్నాయన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్టీయూ ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలకు ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలపై సభలో చర్చ ఉంటుందన్నారు. సమావేశంలో కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జవహర్, గౌరవాధ్యక్షుడు రామాంజులు, ప్రధానోపాధ్యాయులు శిరీషా, జిల్లా కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, రమణనాయక్, రామాంజనేయులు, వీర మహేశ్వర, ధనుంజయరెడ్డి, చరణ్, రామోహన్, లాలుసాబ్, మురళి తదితరులున్నారు.

ఏఐఎస్‌ఏ కమిటీ ఎంపిక

కదిరిఅర్బన్, జనవరి 2: ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ కదిరి నియోజకవర్గ కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. మంగళవారం కదిరిలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా కిరణ్‌దేవ్, కార్యదర్శి పృథ్వీ, సహాయ కార్యదర్శులుగా సింహాద్రి, సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా యశ్వంత్, బాలాజీ, అనిల్‌లను ఎన్నుకున్నారు.

రాజకీయ భిక్ష పెట్టిన పరిటాలనే విమర్శిస్తావా?

గోనుగుంట్లపై విజయ్‌కుమార్ ఆగ్రహం

ధర్మవరం, జనవరి 2: రాజకీయ భిక్ష పెట్టిన పరిటాల కుటుంబాన్నే విమర్శిస్తావా అంటూ ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ మండిపడ్డారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. సూర్యనారాయణ అసమర్థతతో ఓడిపోయి దానిని పరిటాల కుటుంబానికి ఆపాదించడం ఏంటని మండిపడ్డారు. మరోసారి పరిటా ల కుటుంబం గురించి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఫణికుమార్, మద్దిలేటి, గొట్లూరు శీనా, తలారి చంద్రమోహన్‌బాబు, పోతుకుంట లక్ష్మన్న మేకల రామాంజనేయులు, రాంపురం శీనా, కేశగాళ్ల శీనా పాల్గొన్నారు.

సాయీ.. సమస్యలు పరిష్కరించమని జగన్‌కు చెప్పవా..!

సత్యసాయి చిత్రపటానికి అంగన్‌వాడీల వినతి

పుట్టపర్తిరూరల్, జనవరి 2: సాయీ.. మా సమస్యలను పరిష్కరించమని ముఖ్యమంత్రి జగన్‌కు చెప్పవా అంటూ అంగన్‌వాడీలు సాయిబాబాకు వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని ప్రశాంతిగ్రామ్ సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముఖ్యమంత్రికి మంచి బుద్ధి ప్రసాదించి తమ సమస్యలను తీర్చమని అంగన్‌వాడీలు.. సాయిబాబా చిత్రపటానికి వినతిపత్రం అందచేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు సమ్మె విరమించి విధుల్లో చేరాలని లేకపోతే చర్యలు తీసుకోవాలని కలెక్టరు ద్వారా అల్టిమేటం జారీచేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను తీర్చేవరకు సమ్మె విరమించేది లేదని తెగేసి చెప్పారు. తదుపరి కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నామని అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, చలో విజయవాడ కార్యక్రమాలను చేపడతామన్నారు.

చిత్తశుద్ధి ఉంటే సమస్యలు పరిష్కరించాలి...

ధర్మవరం: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. సమ్మెకు వెంకటేశ్ సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారులను అడ్డం పెట్టుకుని సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే బొబ్బిలిలో ఓ ఎమ్మెల్యే ఒళ్లు బలిచి సమ్మె చేస్తున్నారని మాట్లాడటం దారుణమన్నారు. ఎమ్మెల్యే తన మాటలను వెనక్కితీసుకోకపోతే నాలుక తెగ్గోస్తామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా మంత్రి ఉషశ్రీకి వినతిపత్రాలు ఇస్తే మీకు ఇప్పటి వరకు ఇచ్చేవే గొప్ప ఇంకా ఏమిచేయాలని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో నీవు ఐపీ పెట్టి కర్ణాటకకు పారిపోయి తిరిగి వైసీపీ అధికారంలోకి వచ్చాక రూ.800 కోట్లు ఎలా సంపాదించావంటూ ప్రశ్నించారు. ఐసీడీఎస్‌లోనే కాంట్రాక్టుల పేరుతో రూ.400 కోట్లు సంపాదించినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయాన్ని అంగన్‌వాడీలతో దిగ్బంధిస్తామని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్, నాయకులు బాలాజీ,అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గేదెకు వినతి

ముదిగుబ్బ: అంగన్‌వాడీల సమ్మె 22వ రోజు మంగళవారం కూడా కొనసాగింది. ముదిగుబ్బలో సమ్మె శిబిరం వద్ద గేదెకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంగన్‌వాడీలు అందజేస్తూ నిరసన చేశారు.. ఈసందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ....తమకు కనీస వేతనం రూ.26వేలు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5లక్షలు అమలు పరచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్‌చేశారు.

తనకల్లు: మండల కేంద్రంలో అంగన్‌వాడీలు మంగళవారం గేదెకు వినతిపత్రం ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ వేమన్న పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన

కదిరిఅర్బన్: అంగన్‌వాడీలు మంగళవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మాబున్నీషా, ఎల్జిబత్‌రాణీ, చంద్రకళ, లక్ష్మీదేవి, సుశీల, శారద, సుజాత, సిఐటియు జీఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, ఎస్‌ఎఫ్ఐ బాబ్‌జాన్, కార్మిక సంఘం లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలున్నారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్‌నుంచి మంగళవారం అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలున్నారు.

నల్లమాడ: అంగన్‌వాడీల సమ్మె మంగళవారం కొనసాగింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు చేపట్టారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలున్నారు.



పుట్టపర్తిలో సాయిబాబా చిత్రపటానికి అంగన్‌వాడీల వినతి



ముదిగుబ్బలో గేదెకు వినతిపత్రం ఇస్తూ...



కదిరిలో ఒంటికాలిపై నిలబడి నిరసన





సత్యసాయి ప్రేమతత్వంపై నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి, జనవరి 2: సిక్కిం భక్తులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేశాయి. మంగళవారం రాత్రి సాయి కుల్వంత్ మందిరంలో సిక్కిం భక్తులు సత్యసాయి ప్రేమతత్వంపై నృత్యం చేశారు. అనంతరం నాటికను ప్రదర్శించారు. చిన్నారులు తమ సంగీత నృత్యంతో భక్తులను అలరింపచేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వెయ్యిమంది ఆ రాష్ట్ర భక్తులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు

ఓబుళదేవరచెరువు: అంగన్‌వాడీల సమస్యల సాధనకోసం బుధవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో ముందస్తుగా సీఐటీయూ నాయకులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకుని తరువాత ఏఎస్ఐ రమణారెడ్డి సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళాయ్యప్ప, శ్రీరాములకు నోటీసులు అందించారు. నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరన్నారు. హక్కుల సాధన కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. బుధవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిలో అంగన్‌వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



నోటీసులు అందిస్తున్న ఏఎస్ఐ రమణారెడ్డి

పారిశుధ్య పనులను అడ్డుకున్న కార్మికులు


రెగ్యులర్ కార్మికులను అడ్డుకుంటున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

- రెగ్యులర్ కార్మికులతో కాంట్రాక్ట్ కార్మికుల వాగ్వాదం
- సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన కమిషనర్
- ప్రైవేట్ ట్రాక్టర్లలో చెత్తను కింద పడేసి నిరసన

హిందూపురం, జనవరి 2: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మునిసిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు తలపెట్టిన సమ్మె మంగళవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఉదయం ఏఐటీయూసీ ఉన్న రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు చెత్తను శుభ్రం చేస్తుండగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్‌లో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, రెగ్యులర్ కార్మికులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అక్కడికి చేరుకుని సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అయినా ప్రైవేట్ ట్రాక్టర్‌లో చెత్త తరలిస్తుండగా దానిని కిందకు పడేయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు మాట్లాడుతూ... ఈ ప్రభుత్వానికి కార్మికులపట్ల చిత్తశుద్ధి లేదన్నారు. వారం రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం నిరసన శిబిరంలో పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

రెగ్యులర్ కార్మికులు వెళ్లి వీధులు శుభ్రం చేస్తుండగా అక్కడికి వెళ్లిన కాంట్రాక్ట్ కార్మికులు అడ్డుకోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయింది. ముఖ్యంగా పెనుకొండ రోడ్డులో అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, పేట వీధి తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో అపరిశుభ్రంగా మారింది.



వీధిలో పేరుకుపోయిన చెత్త

పగిలిన పైప్‌లైన్... తాగునీరు వృథా


పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

గుడిబండ, జనవరి 2 : మండలంలోని ఫలారం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయింది. ఇది మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్. రెండు రోజుల క్రితం పగిలిపోయింది. దీంతో తాగునీరు వృథా అవుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని, తద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

గోరంట్ల, జనవరి 2: మండలంలోని వానవోలు గ్రామంలో కస్తూరి రంగనాథస్వామి ఆలయ నిర్మాణానికి ఇండ్లూరి కృష్ణమూర్తినాయుడు రూ.లక్ష విరాళం మంగళవారం అందజేశారు. ఓడీసీ మండలంలోని బొమ్మిరెడ్డిచెరువుపల్లికి చెందిన కృష్ణమూర్తి నాయుడు ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

'విద్యార్థులు క్రీడాల్లోనూ రాణించాలి'


విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

మడకశిర రూరల్, జనవరి 2: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో బాగా రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, రామానంద్‌లు మంగళవారం పాఠశాలలోని 32 మంది క్రీడాకారులకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయుడు మాట్లాడుతూ... క్రీడాకారులు క్రీడల్లో తమప్రతిభను చూపించి, జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవీలత, ఎస్తర్‌రాణి, నాగేంద్ర, అశ్వత్థనారాయణ, ప్రకాశ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీలను అరికట్టండి


ఇరిగేపల్లిలో కేబుల్‌ను అపహరించుకెళ్లిన దృశ్యం

అగళి, జనవరి 2: అగళి మండలంలో వ్యవసాయ బోర్ల వద్ద బోరుబావులకు అమర్చిన కేబుల్ ను కత్తిరించి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని మండలంలోని ఇరిగేపల్లి గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు కామరాజు, హనుమంతరాయప్ప పేర్కొన్నారు. దొంగతనాలు విపరీతంగా జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని కోరుతున్నారు. తాగునీటి బోర్ల దగ్గర ఉన్న కేబుల్‌ను కూడా కట్‌చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి దొంగలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటీవలే ఇరిగే పల్లి వద్ద ఓ వ్యవసాయ బోరువావి వద్ద ఉన్న కేబుల్‌ను ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఉచిత ఫుట్‌పల్స్ థెరపీ

పావగడ, జనవరి 2: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈనెల 13వతేదీ వరకు తాలూకా ప్రజల కోసం ఫుట్‌పల్స్ థెరపీ ఉచిత చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తెలియజేశారు. ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించే ఈశిబిరంలో ఎలాంటి మందులు మాత్రలు లేకుండా 30 నిమిషాల పాటు చికిత్స నిర్వహిస్తారని తెలిపారు. గ్యాస్ట్రిక్, వెన్నునొప్పి, తలనొప్పి, నిద్రహీనత, కండరాల నొప్పి, థైరాయిడ్, బీపీ, పక్షవాతం, మధుమేహం తదితర జబ్బులను ఫుట్‌పల్స్ థెరపీ ద్వారా నయం చేస్తారని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనకభాగంలో ఉన్న రోటరీ క్లబ్‌లో నిర్వహించే ఈ శిబిరాన్ని తాలూకా ప్రకజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థుల దాతృత్వం.. వృద్ధులకు సాయం


సేకరించిన బియ్యంతో పాఠశాల విద్యార్థులు, సిబ్బంది

పావగడ/మడకశిర రూరల్, జనవరి 2: ఒక్కో విద్యార్థి నుంచి రోజూ పిడికెడు చొప్పున సేకరించిన బియ్యం పది క్వింటాళ్లకు చేరుకున్నాయి. ఆ బియ్యాన్ని మడకశిర మండలం ఆమిదాలగొందిలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమానికి అందించి మానవత్వం చాటుకున్నారు పావగడ పట్టణంలోని చెళ్లకెరె రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు. పాఠశాల కార్యదర్శి ఎంసీ నాగభూషణ్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధాశ్రమంలో అందజేశారు. నూతన సంవత్సరాన్ని ఈ విధంగా ఆచరించినట్లు ఆయన తెలిపారు. రోజూ ఒక్కో విద్యార్థి పిడికెడు బియ్యం చొప్పున మూడు నెలల నుంచి సేకరించిగా పది క్వింటాళ్లకు చేరుకున్నట్లు తెలిపారు. బియ్యం అందించిన పాఠశాల సిబ్బందికి, కార్యదర్శికి వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు తిమ్మారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షైలారరెడ్డి, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

దున్నపోతులు, గేదెలకు వినతిపత్రాల అందజేత

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిపై మంగళవారం తమ వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దున్నపోతుకు అందించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా హిందూపురం పట్టణ పరిధిలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో అంగన్‌వాడీలు దున్న పోతుకు సీఎం జగన్ మాస్కును తగిలించి, దానికి వినతిపత్రం ఇచ్చారు. తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చమని 22 రోజులుగా కుటుంబాలను వదిలి పిల్లలకు దూరంగా ఉండి నెత్తీనోరు కొట్టుకుంటున్నా ప్రభుత్వం దున్నపోతు నిద్రపో తున్నట్లుగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ కార్మి కులు కూడా అంగన్‌వాడీలతో జతకలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే పెనుకొండలోని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద, చిలమ త్తూరు, గోరంట్ల, సోమందేపల్లి, లేపాక్షి తహసీల్దార్ కార్యాలయాల వద్ద, సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గేదెకు వినతిపత్రం అందించి నిరసన తెలియజేశారు. చిలమత్తూరులో కార్యక్రమానికి సీఐటీ యూ నాయకులు రాష్ట్ర ఓబుళు హాజరై మద్దతు ప్రకటించారు. అదే విధంగా మడకశిర పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణంలో, గుడి బండ సీడీపీఓ కార్యాలయం ఎదుట, అగళిలో అంన్‌గవాడీలు నిరసన కార్యక్రమం కొనసాగించారు. ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని దున్నపోతులకు, గేదెలకు వినతిపత్రం అందజేశారు.


పెనుకొండలో గేదెకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు


చిలమత్తూరులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు


సోమందేపల్లిలో గేదెకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం


అగళిలో గేదెకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


గుడిబండలో...

ఎనిమిదోరోజు పారిశుధ్య కార్మికుల సమ్మె

మడకశిరలో ట్రాక్టర్‌కు అడ్డంగా పడుకుని నిరసన

మడకశిరటౌన్, జనవరి 2: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎనిమిది రోజులుగా మడకశిరలో నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో నగర పంచాయతీ అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయించుకోవడానికి ఏర్పాట్లు చేశారు. అందుకోసం మంగళవారంనగర పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఉన్న ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్నసమయంలో నగర పంచాయతీ కార్మికులు రోడ్డుపై బైఠాయించారు. ట్రాక్టర్ చక్రాల కింద పడుకుని తమ నిరసన తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకొని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, లేని పక్షంలో ప్రభుత్వం ఎంత బెదిరించినా ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తునే ఉంటామన్నారు. చివరకు ట్రాక్టర్‌ను మున్సిపల్ అధికారులు అదే స్థానంలో నిలిపి వేశారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు.



పెనుకొండలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు లక్ష్మీనారాయణ

పెనుకొండ, జనవరి 2 : సమస్యల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, పనిభారం తగ్గించాలని, కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, రమేష్, బాబావలి, లక్ష్మీనారాయణ, వెంకటేష్, మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు చిన్నవెంకటేష్, తిప్పన్న, రిక్షా నరసింహులు, నరసింహులు, ముత్యాలు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

పెనుకొండ టౌన్, జనవరి 2 : అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు అందివ్వాలని తహసీల్దార్ కార్యాల యం ఎదుట సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతి యాజ్ డిమాండ్ చేశా రు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన స్థానిక పేద ప్రజలతో కలిసి ఆయన ధర్నా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మా ట్లాడుతూ... అర్హులకు తక్షణం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింద న్నారు. అయినా రెవె న్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. అర్హులైన వారికి ఇంటిపట్టాలు ఇవ్వకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్‌బాబు లబ్ధిదారులతో మాట్లాడుతూ... సర్వేచేసి అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గంగాధర్, పెద్దన్న, తిప్పన్న, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో వైసీపీ నాయకుల ఆందోళన


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు రామ్మోహన్ రెడ్డి

పెనుకొండ రూరల్, జనవరి 2: పెనుకొండకు ఉషశ్రీ వద్దనీ.. శంకర్‌నారాయణకే టిక్కెట్టు ఇవ్వాలని వైసీపీ నాయకులు పట్టుబట్టారు. లేనిపక్షంలో రాజీనామాలకు సిద్ధమని పెనుకొండలో ఆందోళన చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో మంగళవారం ఆ పార్టీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, వైసీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ కంచుకోట అయిన పెనుకొండ నియోజకవర్గంలో పార్టీ కోసం 2014 నుంచి ఎమ్మెల్యే శంకర్ నారాయణ అహర్నిశలు కష్టపడ్డారని పేర్కొన్నారు. ఇదే నియోజకవర్గంలో ఉండి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పార్టీని ముందుకు నడిపిస్తున్నారన్నారు. కుల సమీకరణ అనే పేరుతో అధిష్ఠానం టికెట్‌ల విషయంలో అభ్యర్థిని మార్చుతూ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అధిష్ఠానం మరోసారి పునరాలోచించి పెనుకొండ నియోజకవర్గానికి శంకర్‌నారాయణకే టికెట్ ఇవ్వాలన్నారు. అలా ఇవ్వకపోతే రాజీనామా చేసేందుకు సిద్ధమని అగ్రిగోల్డ్ ఛైర్మన్ కొండలరాయుడు, వెంకటగిరి సర్పంచ్ ఆదినారాయణ తదితరులు తేల్చి చెప్పారు. అనంతరం ఉశశ్రీ వద్దు శంకర్‌నారాయణ కావాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, అగ్రిగోల్డ్ ఛైర్మన్ కొండలరాయుడు, శ్యామ్‌నాయక్, ఉప్పర కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

కంది పంటకోత ప్రయోగాలు

గోరంట్ల, జనవరి 2: మండలంలోని వడిగేపల్లి, జక్కసముద్రం గ్రామాల్లో వ్యవసాయాధి కారులు కంది సాగుపై పంటకోత ప్రయోగాలు మంగళవారం నిర్వహించారు. వడిగేపల్లిలో రైతు అశ్వత్థప్ప, జక్కసముద్రంలో శివశంకర్‌రెడ్డి, సరోజమ్మ సాగు చేసిన కందిపంటను అధికారులు పరిశీలించారు. దిగుబడిపై శాస్త్రీయ పద్ధతిలో పరిక్షించారు. ఈ కార్యక్రమంలో బీమా కంపెనీ కోఆర్డినేటర్లు పుట్టపర్తి రవినాయక్, బాబు, మండల ఎఓ మునికృష్ణ, ఆర్బీకే సిబ్బంది, రైతులున్నారు.

దశరథ రామిరెడ్డి అరెస్టు అన్యాయం

రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు రాజశేఖర్‌రెడ్డి

పెనుకొండ, జనవరి 2:

రాయలసీమ ఉద్యమనేత బొజ్జ దశరథరామిరెడ్డిని అరెస్ట్ చేయడం అన్యాయమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాయలసీమ విద్యావంతుల వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడు తూ... 12సంవత్సరాలుగా రాయలసీమ నీటి హక్కుల కోసం బొజ్జ దశరథరామిరెడ్డి అనేక ఉద్యమ పోరాటాలు చేశారన్నారు. రాయలసీమలో అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులను ప్రచారం చేస్తూ సత్యాగ్రహ దీక్షలు, పాదయాత్రల ద్వారా ప్రచార ఉద్యమాన్ని చేప ట్టారన్నారు. రాయలసీమ కరువు నివారణకు హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగా ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సాగునీరు అందించాలని ప్రచారం చేస్తూ పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారన్నారు. దశరథరామిరెడ్డి అరెస్ట్‌ను అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలని ఆయనను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆయనపై బనాయించిన అక్రమ కేసులను తొలగించాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని కోరుతున్నామన్నారు.

వాల్మీకులకు చట్టసభల్లో స్థానం కల్పించాలి

సీమవ్యాప్తంగా 2 ఎంపీ, 6 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి

ఏపీ వాల్మీకి సంఘం కన్వీనర్ ఈశ్వరయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

హిందూపురం అర్బన్, జనవరి 2: అన్ని రాజకీయ పార్టీలు వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి చట్టసభల్లో మాట్లాడే అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం రాష్ట్ర కన్వీనర్ కోనాపురం ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో హిందూపురం వాల్మీకి సంఘం నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు వాల్మీకులకు చట్టసభల్లో మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో జనాభా దామాషా ప్రకారం 25 శాతం మంది వాల్మీకి కులస్థులు ఉన్నారన్నారు. ప్రతి పార్టీ వాల్మీకులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. రాయలసీమ వ్యాప్తంగా రెండు ఎంపీ స్థానాలు, ఆరు ఎమ్మెల్యే సీట్లను ప్రతి పార్టీ కేటాయిచాలని కోరారు. లేని పక్షంలో వాల్మీకుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. స్థానికంగా ప్రజల కష్టనష్టాలు, అవసరాలు, వారి బాగోగులు తెలిసిన వారికి టికెట్లు కేటాయించాలన్నారు. అలాకాకుండా స్థానికేతరులకు టికెట్లు ఇస్తే సహకరించే ప్రసక్తే లేదని తెలిపారు. డబ్బే ప్రాధాన్యం కాదని ప్రతి పార్టీ గ్రహించాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు రామకృష్ణ, టీఎస్ మూర్తి, వినయ్‌కృష్ణ, సాయిరాం. లక్ష్మణ్, విజయ్‌కుమార్, వెంకటరమణ, వాల్మీకి చిరు, లక్ష్మీనారాయణ, నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు


భోగిమంట వద్ద డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

పెనుకొండ, జనవరి 2: స్థానిక గ్లోబుల్‌జెన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగు రంగుల పూలతో అలంకరించారు. తరగతి గదులను చెరుకుగడలు, పూలహారాలతో అలంకరించారు. బోగిమంటలు వేసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్రాంతి పండగ విశిష్టతను పిల్లలకు వివరించారు. రైతులకు కొత్త పంటలు చేతికి అందే సమయంలో సంక్రాంతి లక్ష్మిని పూజిస్తారని తెలిపారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడంతో ఉత్తరాయణం మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మంజువాణి, డైరెక్టర్లు సాయిసృజన, శ్రీధర్, ఉపాధ్యాయులు, చిన్న పిల్లలకు తలపై బొటికలు వేసి హారతులు ఇచ్చారు.